క్లుప్తంగా

కొత్తూరులో పీడీ పూజలు



సూర్యనారాయణకు తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకుడు

పాణ్యం: కొత్తూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నంద్యాల జిల్లా ఎన్‌ఆర్‌జీఎస్ పీడీ సూర్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆయన అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అర్చకులు సురేష్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండిమాల కానుక



దాత అందజేసిన వెండిమాల

పాణ్యం: మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసిన వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన క్రి.శే. చిమట పోతురాజు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రామకృష్ణ, లక్ష్మీ దంపతులు 260 గ్రాముల వెండి పుష్పమాలను కానుకగా అందజేసినట్లు ఈఓ రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ అధికారులు శేషవస్త్రాలు, తీర్థప్రసాదా లు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



1985-86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985-86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

ముగిసిన ఉరుసు



కిస్తీ కార్యక్రమంలో పాల్గొన్న యువకులు

సి.బెళగల్: మండల కేంద్రంలోని కోటా వీధిలో వెలసిన దస్తగిరయ్య ఉరుసు ఆదివారం ఘనంగా ముగిసింది. గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో శనివారం కిస్తీ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కిస్తీ కార్యక్రమంలో భాగంగా భక్తులు కోట వీధిలో దర్గాకు కిస్తీ ఎద్దుల బండ్లను చేర్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్గా వద్ద స్వాముల ప్రసాదాన్ని అందుకునేందుకు భక్తులు, యువకులు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా ముగిసినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

వధువుకు ఆర్థిక సాయం



వధూవరులకు రూ.10 వేలు సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసరెడ్డి


కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసరెడ్డి ఆదివారం గ్రామంలో వివాహం చేసుకున్న నూతన వధూవరులకు రూ.10 వేలను సాయంగా అందజేశారు. తల్లిదండ్రులు ప్రమీలమ్మ, అనంతరెడ్డిల జ్ఞాపకార్థం ముడుమలగుర్తి గ్రామంలో పెళ్లి చేసుకునే నిరుపేద కుటుంబాలకు చెందిన యువతులకు తన వంతు సాయంగా రూ.10 వేలను విరాళంగా అందజేస్తున్నట్లు చెప్పారు. పేదింటి యువతుల వివాహానికి శ్రీనివాసరెడ్డి చేస్తున్న సాయాన్ని గ్రామస్తులు అభినందించారు.

నేటి నుంచి పునఃప్రారంభం

కర్నూలు కల్చరల్: ఉమ్మడి జిల్లా పరిధిలోని రాయలసీమ యూనివర్సిటీ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. గత నెల 26వ తేదీ నుంచి వర్సిటీలకు దసరా సెలవులు ప్రకటించారు. సెలవుల అనంతరం వర్సిటీలు తిరిగి ప్రారంభమై యథా విధిగా పీజీ తరగతులు మొదలు కానున్నాయి.

కదల్లేక.. కన్నీటి వేదన

- చిన్నారులను వేధిస్తున్న సెరిబ్రల్ పాల్సీ
- పుట్టుకతోనే అంగవైకల్యం
- ప్రతి వెయ్యి మంది పిల్లల్లో ఐదుగురికి సమస్య
- ప్రసవ సమయంలో జాగ్రత్తలే శ్రీరామరక్ష
- నేడు వరల్డ్ సెరిబ్రల్ పాల్సీ అవగాహన దినం



కర్నూలు(హాస్పిటల్): పెళ్లయిన జంటలకు తల్లిదండ్రులుగా మారాలని ఎంతో ఆశగా ఉంటుంది. జన్మించే బిడ్డ కోసం వారు ఆదుర్దాగా ఎదురుచూస్తారు. తీరా జన్మించాక ఆ బిడ్డ సరిగ్గా కదల్లేక జీవితాంతం ఇంకొకరిపై ఆధారపడి జీవించాల్సి వస్తుందని తెలిస్తే వారికి గుండెలు పగిలే వేదన మిగులుతుంది. ఇలా జన్మించిన పిల్లలను సెరిబ్రల్ పాల్సీ వచ్చిందని వైద్య పరిభాషలో చెబుతారు. ఇటీవల కాలంలో ప్రతి వెయ్యి మంది పిల్లల్లో 5 మంది ఇలాంటి వారే జన్మిస్తున్నారు. ఈ నెల 6వ తేదీన వరల్డ్ సెరిబ్రల్ పాల్సీ అవగాహన దినం సందర్భంగా ప్రత్యేక కథనం. జిల్లాలో సెరిబ్రల్ పాల్సీతో జన్మిస్తున్న పిల్లల సంఖ్య ప్రతి వెయ్యిలో 5 మంది దాకా ఉంటోంది. ముఖ్యంగా కొన్ని రకాల సామాజిక వర్గాలకు చెందిన పిల్లల్లో, నిరక్షరాస్యత అధికంగా ఉన్న కోసిగి, ఆలూరు, ఆస్పరి, కౌతాళం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, హాలహర్వి, డోన్, క్రిష్ణగిరి, తుగ్గలి, చిప్పగిరి, కోడుమూరు, గూడూరు వంటి ప్రాంతాల్లో ఇలాంటి పిల్లలు అధికంగా జన్మిస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. ఇతర పిల్లలతో పోల్చుకుంటే సెరిబ్రల్ పాల్సీ రుగ్మత ఉన్న పిల్లలు విభిన్నంగా ఉంటారు. వీరి ప్రవర్తన, పనితీరు, నడవడం, మాట్లాడటం, తినడం, రాయడం, కూర్చోవడం భిన్నంగా ఉంటాయి. వీరిలో కండరాలు బిగుసుకుపోవడం, కదలికలో లోపాలు ఉంటాయి. మెదడు శాశ్వతంగా దెబ్బతినడం వల్ల, అసాధారణమైన ఎదుగుదల వల్ల ఈ సమస్య వస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. మానవుడి శరీరానికి సంబంధించిన ప్రతి పనితీరును మెదడులోని సెరిబ్రమ్ అనే భాగం నిర్దేశిస్తుంది. నాలుగు నిమిషాల కన్నా ఎక్కువ సమయం మెదడుకు ఆక్సిజన్ అందకపోతే మెదడులోని నాడీవ్యవస్థ దెబ్బతింటుంది. ఇది శిశువుకు శాశ్వత అంగవైకల్యానికి దారి తీస్తుంది. అవసరమైన రక్త పరీక్షలు, క్రేనియల్ అల్ట్రాసౌండ్, మెదడుకు ఎంఆర్‌ఐ, సిటిస్కాన్ పరీక్షల ద్వారా ఈ వ్యాధిని నిర్ధారిస్తారు.

సెరిబ్రల్ పాల్సీలో రకాలు స్పాస్టిక్ సెరిబ్రల్ పాల్సీ

దాదాపు 70 శాతం మంది పిల్లలు ఈ రకానికి చెందిన వారే. ఈ రకం పిల్లల్లో కండరాలు బాగా బిగుసుకుపోతాయి. శరీర భాగాల పెరుగుదలలో లోపం ఉంటుంది. కండరాల సంకోచ, వ్యాకోచాల్లో తేడాలు ఉంటాయి. దీని కారణంగా కదలికలో ఇబ్బందిగా ఉంటుంది. కత్తెర కాలి నడక, మునివేళ్లపై నడవడం వీరిలో గమనిస్తాము.

ఎటాక్సిక్ సెరిబ్రల్ పాల్సీ

దాదాపుగా 10 శాతం పిల్లలు ఈ రకానికి చెందిన వారే. వీరిలో కండరాలు బలహీనంగా ఉంటాయి. కండరాల సమన్వయం లోపిస్తుంది. నడవడం, రాయడం వంటి పనుల్లో సమన్వయం లోపిస్తుంది.

సెరిబ్రల్ పాల్సీకి కారణాలు

- ప్రసవ సమయంలో కొందరు శిశువులకు మెదడుకు ఆక్సిజన్, రక్తసరఫరా/గ్లూకోజ్ సరఫరా జరగదు. ఇలాంటి వారికి మెదడు దెబ్బతిని సెరిబ్రల్ పాల్సీ వచ్చేందుకు అవకాశం ఉంది.
- ప్రసవ సమయంలో కలిగే ఇబ్బందులు, తల్లి గర్భంలో ఉమ్మనీటిలో గర్భస్థ శిశువు మూత్ర విసర్జన చేసి దానిని పీల్చడం వల్ల కూడా ఆ బిడ్డకు ఆక్సిజన్ అందదని వైద్యులు చెబుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో కూడా సెరిబ్రల్ పాల్సీ ఏర్పడుతుందంటున్నారు.
- నెలలు నిండకుండా జరిగే ప్రసవాల వల్ల కూడా ఈ వ్యాధి ముప్పు పొంచి ఉంది. కొందరు పిల్లలు పుట్టగానే ఏడవరు. దానిని పుట్టుకతో వచ్చిన ఆస్ఫిక్సియా అంటారు.
- కొంత మందికి పుట్టుకతో వచ్చే అనారోగ్య సమస్యల వల్ల మెదడుపై ప్రభావం చూపవచ్చు. బిడ్డ పుట్టగానే వచ్చే పచ్చ కామెర్లకు సరైన సమయంలో తగిన చికిత్స అందకపోయినా కూడా మెదడుపై ప్రభావం పడే అవకాశం ఉంది.
- కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లు, మెనింజైటిస్, కొన్ని రకాల జన్యుకారణాల లాంటివి కూడా ఈ వ్యాధికి దారి తీయవచ్చు.

ఎథిటాయిడ్ సెరిబ్రల్ పాల్సీ

సెరిబ్రల్ పాల్సీతో జన్మించిన 10 శాతం మంది పిల్లల్లో ఈ రకం కనిపిస్తుంది. వీరిలో అవాంఛిత కదలికలు ఉంటాయి. కూర్చున్నప్పుడు, నిల్చున్నప్పుడు, రాస్తున్నప్పుడు అసాధారణ కదలికలు ఉంటాయి.

మిక్స్‌డ్ సెరిబ్రల్ పాల్సీ

ఇందులో పైన పేర్కొన్న అన్ని రకాల లక్షణాలు కనిపిస్తాయి.

చికిత్సతో పాటు థెరపీలు ప్రధానం



సెరిబ్రల్ పాల్సీ రుగ్మత ఉన్న పిల్లలకు చికిత్సతో పాటు థెరపీలు ప్రధాన పాత్ర వహిస్తాయి. వారికి ప్రత్యేకంగా మందులు అంటూ ఏమీ ఉండవు. లక్షణాలు, వారికున్న ఇబ్బందులను బట్టి మందులు ఇస్తాం. అవసరమైన వారికి కొన్ని రకాలైన సర్జరీలు సూచిస్తాం. ముఖ్యంగా స్పీచ్ థెరపి, ఫిజియోథెరపి, రిహాబిలిటేషన్, వైద్యుల సలహాలతో మందులు తీసుకోవడం ముఖ్యం. వీరికి ప్రత్యేకంగా కొన్ని రకాల బూట్లు ధరించడం వల్ల కూడా నడకలో మార్పు రావచ్చు.

– డాక్టర్ కె.హేమంత్‌కుమార్, న్యూరాలజిస్టు, కర్నూలు

గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



గర్భంతో ఉన్న మహిళలు ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. ప్రసవ సమయంలో గర్భంలోని శిశువు మూడున్నర కిలోల కంటే ఎక్కువ బరువున్నా ఇబ్బంది అవుతుంది. ఆ బిడ్డ బయటకు రావడానికి ఇబ్బంది ఏర్పడి మెదడుకు గాయమై సెరిబ్రల్ పాల్సీ వస్తుంది. బిడ్డ జన్మించాక కూడా పెరిగే క్రమంలో కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. వాటికి వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకుంటే ఇలాంటి వ్యాధులు రావు.

– డాక్టర్ విజయానందబాబు, హెచ్ఓడీ, చిన్నపిల్లల విభాగం, జీజీహెచ్, కర్నూలు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు (టౌన్): నగరంలోని సుంకేసుల రోడ్డులో నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలకలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమస్యకు నిర్దేశిత గడువులోపు పరిష్కారం లభిస్తుందని, సమస్య పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు htt pr://meekosam.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేటి నుంచి అంతర్రాష్ట్ర హోమ్ టీం కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండలంలోని కోయిలకొండ గ్రామంలో వాల్మీకి జయంతి సందర్భంగా ఈ నెల 6వ తేదీ నుంచి అంతర్రాష్ట్ర హోమ్ టీం కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.2 వేలు అందిస్తామని చెప్పారు. అలాగే బెస్ట్ రైడర్, డిఫెండర్‌కు రూ.వెయ్యి చొప్పున అందస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు సోమవారం ఉదయం 9 గంటలలోపు రూ. 500 ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9493686207, 6300364569 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డ్యూటీల విషయంలో పక్షపాత వైఖరి తగదు

కర్నూలు సిటీ: కర్నూలు–2 డిపోలో డ్రైవర్లకు, కండక్టర్లకు డ్యూటీలు వేసే విషయంలో చార్ట్ వద్ద యూనియన్ పక్షపాత వైఖరి చూపిస్తోందని, ఇందుకు నిరసనగా ఆదివారం డిపో ఎదుట ఏపీ ప్రజా రవాణా శాఖ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. యూనియన్ డిపో కార్యదర్శి జి.మహేశ్వర రావు మాట్లాడుతూ.. చార్ట్ కౌన్సెలింగ్ జరిగి చాలా కాలం అయ్యిందని, వెంటనే చార్ట్ కౌన్సిలింగ్ జరపాలన్నారు. చార్ట్ వద్ద కొంత మంది ఏడీసీలు దరుసుగా మాట్లాడుతూ సిబ్బందిని ఇబ్బంది పెట్టడం మానుకోవాలన్నారు. కర్నూలు వయా గుడూరు ఎమ్మిగనూరు వెళ్లే మార్గంలో రోడ్డు సక్రమంగా లేకపోవడంతో డ్రైవర్లు, కండక్టర్లు విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి రోజు అర్ధరాత్రి అవుతోందని తెలిపారు. డబుల్ డ్యూటీలు చేస్తేనే సెలవులు ఇస్తామనే విధానాన్ని మానుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలు చేస్తామన్నారు. డిపో–2 మేనేజర్ చొరవ తీసుకొని డ్రైవర్లు, కండక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డిపో మేనేజర్ తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలేష్, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి



పంటలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు: అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం సల్కాపురం, కె.మార్కాపురం, పర్ల, బస్తిపాడు, చిన్నటేకూరు, పెద్దటేకూరు గ్రామాల్లో రైతులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు రుణమాఫీతో పాటు పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు జరగనున్నాయని తెలిపారు. సీపీఐ నాయకులు రామాంజనేయులు, బడే సాహెబ్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే నీటి కొరత



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కల్లూరు: చెన్నరాయుని తిప్ప రిజర్వాయర్‌ను నీటితో నింపి 11 గ్రామాలకు సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఉలిందకొండలో మహేశ్వర్లు అధ్యక్షతన జరిగిన రైతు సంఘం మండల మహాసభలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వాల వైఫల్యంతో సాగునీటి లభ్యత తగ్గిపోయిందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలని, గిట్టుబాటు ధర కల్పించాలని, యూరియా కొరతను తీర్చాలని కోరారు. సంఘం మండల కార్యదర్శి కృష్ణ, శేఖర్, సుధాకర్, విశ్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతకు సన్మానం



సిరిగిరి మద్దిలేటిని సత్కరిస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: కోడుమూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా వింగ్ మండలాధ్యక్షుడు సిరిగిరి మద్దిలేటి ఇప్పటి వరకు ఆపదలో ఉన్న పలువురికి ఏకంగా 22 సార్లు రక్తదానం చేసి ప్రాణాలు నిలిపాడు. దీంతో ఆదివారం సిరిగిరి మద్దిలేటిని స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు రాజు, శేషుకుమార్ స్థానిక నాయకులతో కలిసి పూలమాల, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఎక్కడ ఎవరికి రక్తం అవసరమైనా సిరిగిరి మద్దిలేటి తక్షణమే స్పందిస్తూ అక్కడికి వెళ్లి రక్తదానం చేయడంతో పాటు, తన స్నేహితులతో సైతం రక్తదానం చేయిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తున్న మద్దిలేటి సేవలు ఎంతో ఘనమైనవని వారు కొనియాడారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చిన్న రాముడు, నాయకులు బాబురావు, క్రిష్ణ, తిమ్మప్ప, మధు, బజారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న కోచ్‌లు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన దివ్యశ్రీ, బేతంచెర్ల పట్టణానికి చెందిన శ్రీవల్లిరెడ్డి రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు కోచ్‌లు వెంకటేశ్వర్లు, నాగన్న ఆదివారం తెలిపారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 4న నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–14 బాలికల విభాగం పోటీల్లో దివ్యశ్రీ (26–29 కిలోల విభాగం), శ్రీవల్లిరెడ్డి (30 కిలోల విభాగం) ప్రథమ స్థానాలు సాధించారు. విద్యార్థినులను అభినందించారు.

పదేళ్లు కేసులు లేకుంటే రౌడీషీట్ ఎత్తివేత

కర్నూలు (టౌన్): పదేళ్ల పాటు ఎలాంటి కేసు నమోదు కాకుంటే రౌడీషీట్ ఎత్తేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని నాలుగవ పట్టణ సీఐ విక్రమసింహా అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. మాజీ నేరస్తుల పిల్లల చదువుల కోసం సంబంధిత యాజమాన్యాలతో మాట్లాడి ఫీజులు విషయంలో తగ్గించేలా కృషి చేస్తామన్నారు. ఎవరికైనా ఆనారోగ్య సమస్యలు, వ్యక్తిగత సమస్యలుంటే పరిష్కరించే మార్గాలు చూపిస్తామన్నారు. నేరాల జోలికి వెళ్లకుండా సత్ప్రవర్తన కలిగి ఉన్న వారిపై పోలీసు అధికారుల సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. మంచి నడవడిక ఉన్న వారు ఎలాంటి సహాయం అడిగినా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తప్పు చేయాలనే ఆలోచన ఉన్న వారిపై నిరంతరం నిఘా ఉంటుందని హెచ్చరించారు.

పీజీఆర్‌ఎస్‌కు అధికారులందరూ హాజరవ్వాలి

సి.బెళగల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె ప్రకటనలో వెల్లడిస్తూ.. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పకుండా హాజరు కావాలన్నారు. హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



నూతన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మాదిగ దండోర, అంబేద్కర్ కమిటీ సభ్యులు

కోడుమూరు రూరల్: గూడూరులో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు శాంతకుమారి, తనూజ, సువర్ణ, వినయ్‌కుమార్, ప్రసాద్, రవితేజ ఆచారి, విష్ణువర్ధన్ ఆచారి, షాషావలి, షేక్ ఉస్మాన్‌లను ఆదివారం మాదిగ దండోర, అంబేద్కర్ కమిటీ సభ్యులు దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రెసిడెంట్ మాధవరావు మాట్లాడుతూ.. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులంతా నైతిక విలువలతో కూడిన విద్యను బోధించి, ప్రతి పేద విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించేలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మాదిగ దండోర, అంబేద్కర్ కమిటీ సభ్యులు నాగరాజు, బాబు, రవి, అశోక్, ఆనందరావు, శాంతరాజు, మధు, జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

నేతలకు అభినందనల వెల్లువ



కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని అభినందిస్తున్న సి.బెళగల్ వైఎస్సార్‌సీపీ నాయకులు



మణి గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ యువ నాయకులు

సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గానికి చెందిన నేతలు కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీకి రాష్ట్ర స్థాయి పార్టీ పదవులు దక్కడంపై సి.బెళగల్ మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభినందనలతో ముంచెత్తారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, అదేవిధంగా మణి గాంధీ పార్టీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడిగా నియామకం అయ్యారు. ఈ మేరకు ఆదివారం సి.బెళగల్ మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి, నాయకులు కర్నూలుకు చేరుకుని కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మణిగాంధీకి పూలమాలలు వేసి, సీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. నాయకులను కలిసిన వారిలో పులిరాజు, తిరుమలేష్, నరసింహుడు, హారున్, మల్లికార్జున, మహానంది, లచ్చప్ప, గోపాల్, దస్తగిరి, శంకర్‌రెడ్డి, నాగేశ్వర రెడ్డి, ఎస్ఎం బాషా, రంగనాయుడు, ప్రేమ్, కరుణాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రుక్మండ, శ్రీనివాసులు, మద్దిలేటి, బాలరాజు, రామాంజనేయులు, గోరంట్ల, పెద్దయ్య, సర్పంచ్‌లు పాండురంగన్న, దస్తగిరి తదితరులు ఉన్నారు.

వాహనం బోల్తా ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం ఘాట్ రోడ్డు లో మలుపులవద్ద మినిట్రాలీ బోల్తాపడి ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు ఆదివారం తెలిపారు. వివరాల మేరకు పిన్నాపురం గ్రామ సమీపంలో చేపడుతున్న సోలార్ పరిశ్రమలో సెక్యూరిటీగార్డులు విధులు ముగించుకోని తిరిగి వస్తుండగా మలుపుల వద్ద వాహనం బోల్తాపడిందన్నారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దివ్యమాత దర్శనం.. సకల పాపహరణం



ఉత్సవాలకు ముస్తాబైన చౌడేశ్వరి దేవాలయం



గర్భగుడిలో కొలువైన అమ్మవారు

- నేడు ఓర్వకల్లులో చౌడేశ్వరిదేవి తిరుణాల
- రేపు జ్యోతుల మహోత్సవం


ఓర్వకల్లు: తొగట వీరక్షత్రియుల ఆరాధ్య దైవం, భక్తుల విశ్వాసానికి ప్రతీకగా భావించే చౌడేశ్వరి మాత తిరుణాల మహోత్సవం సోమవారం ఉదయం ఓర్వకల్లు గ్రామంలో ప్రారంభం కానుంది. కొలిచే వారికి కొంగు బంగారంలా భావించే అమ్మవారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగి సౌఖ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

విశిష్ట పూజలు: తొగట వీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల అనంతరం ఐదు రోజుల పాటు ఉదయం, సాయంత్రం విశిష్ట పూజలు, లలితసహస్రనామార్చనలు నిర్వహించనున్నారు. పౌర్ణమికి ముందు రోజు అమ్మవారికి అభిషేకాలు, సహస్ర నామార్చనతో పాటు ఆలయాన్ని అలంకరించి నైవేద్యాలు సమర్పిస్తారు. రాత్రి ఆకు పూజ, హరికథలు, ఉపన్యాసాలు, భజనలు నిర్వహించనున్నారు. భజన కళాకారులచే చెక్కభజన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున 2 గంటలకు పూర్వాచారాల ప్రకారం జ్యోతుల మహోత్సవం వైభవంగా జరుగనుంది.డప్పుకళాకారుల నృత్యాలు, నందికోల సేవ, ఖడ్గశావల ప్రదర్శన నిర్వహిస్తారు. ఈ ఏడాది అమ్మవారికి భక్తులు 26 జ్యోతులను సమర్పించారని ఆలయ పూజారి రామకృష్ణ తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు.

అమ్మవారిని దర్శించుకోనున్న నేతలు

చౌడేశ్వరి తిరుణాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే గౌరు చరిత, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకోనున్నారు. అమ్మవారికి చీర సారెలతో మొక్కులు తీర్చుకోనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

పిచ్చి మొక్కల మధ్య కార్యాలయాలు





పిచ్చిమొక్కలతో నిండిన ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ

కోడుమూరు రూరల్: కోడుమూరులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణమంతా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. వాటిని మొక్కల దశలోనే తొలగించకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయి చిట్టడవులను తలపిస్తున్నాయి. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గ్రామ సచివాలయం, ఉపాధి, వెలుగు కార్యాలయాలతో పాటు, ప్రాథమిక పాఠశాల ఉంది. ఆయా కార్యాలయాల్లో పని నిమిత్తం నిత్యం అనేక మంది ప్రజలు వచ్చి వెళుతుంటారు. పిచ్చి మొక్కలతో, వాన నీటి బురదతో కార్యాలయాల ఆవరణలు నిండిపోవడంతో వివిధ అవసరాల నిమిత్తం వచ్చి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా పాఠశాల విద్యార్థులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన జారుడు బండ, పరికరాల చుట్టూ పిచ్చిమొక్కలు నిండిపోయాయి. దీంతో పాఠశాలకు చిన్న పిల్లలు వచ్చి వెళ్లే సందర్భాల్లో ఏ మూల నుంచి ఏ విషపురుగు వస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

మాజీ ఉప సర్పంచ్ మృతి



షేక్ మహబూబ్ బాషా (ఫైల్)

పాణ్యం: పాణ్యం మేజర్ గ్రామపంచాయతీ మాజీ ఉప సర్పంచ్ షేక్ మహబూబ్‌బాషా (ఆటోమాబు –60) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. బీసీ కాలనీలోని ఇంట్లో ఉండగా ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు శాంతిరామ్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపై మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా సోమవారం అంత్యక్రియలు జరగనున్నాయి.

వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించాలి

సి.బెళగల్: మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలు మహర్షి వాల్మీకి జయంతిని నిర్వహించుకోవాలని వీఆర్‌పీఎస్ మండలాధ్యక్షుడు ముడుమాల మద్దిలేటి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా మంగళవారం ఆదికవి, మహర్షి వాల్మీకి జయంతిని నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల వాల్మీకి, బోయలు మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.

ఉచిత వైద్య శిబిరం



కొండాపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సి.బెళగల్: మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇజ్రాయేల్, ఏసురాజు, లక్ష్మన్న ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన అమీలియో ఆసుపత్రి వైద్య అధికారులు, సిబ్బందిచే ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో గ్రామస్తులకు బీపీ, షుగర్, 2డీ ఎకో, ఈసీజీ, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు నిర్వాహకులకు, వైద్య సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శైలజ, అఫ్రీన్, సిబ్బంది చంద్రహాస్, కల్యాణి గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలనుకునే వారు 91821 79345 సెల్ నంబర్‌ను సంప్రదించాలని వైద్యులు లక్ష్మిప్రసాద్ సూచించారు.